క్లుప్తంగా

జాతీయస్థాయి ఎద్దుల పోటీలు ప్రారంభం

అచ్చంపేట: ఎన్టీఆర్ శతజయంత్యుత్సవాలలో భాగంగా మండలంలోని వేల్పూరు రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద టీడీపీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి బండలాగుడు ఎద్దుల పోటీలు బుధవారం ప్రారంభించారు. ఈ పోటీలు ఈనెల 29 వరకు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. వివిధ సైజులలో పోటీలు జరుగుతాయని వెల్లడించారు. ఇప్పటికే పలు జిల్లాల నుంచి పోటీలో పాల్గొనేందుకు ఎద్దులు వచ్చాయి.

అచ్చమ్మ పేరంటాళమ్మ తిరునాళ్ల



అచ్చంపేట: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక అచ్చమ్మ పేరంటాళమ్మ తల్లి ఆలయంలో బుధవారం తిరునాళ్ల మహోత్సవం నిర్వహించారు. అమ్మవారికి వివిధ రకాల పూజా ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు జరిగాయి. ఆర్యవైశ్య మహిళా విభాగం వారిచే లలిత, గాయత్రి అష్టోత్తర శతనామార్చనలు నిర్వహించారు. భజన కార్యక్రమాలు చేపట్టారు. ఉత్సవ నిర్వాహకులు సూరే సుబ్బారావు, మద్ది కోటేశ్వరరావు ఆధ్వర్యంలో భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. వాగొడ్డు కాపుల ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభ నిర్మించారు. పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘనంగా కావమ్మ తల్లి తిరునాళ్ల

చిలకలూరిపేట: పట్టణంలోని శారద జెడ్పీ హైస్కూల్ రోడ్డులో ఉన్న కావమ్మ తల్లి, మారయ్య గుడి తిరునాళ్ల మహోత్సవం బుధవారం నిర్వహించారు. ఆలయంలో అమ్మవారికి విశేష అలంకరణలు గావించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం మహిళా భక్తులతో కుంకుమ పూజ, నూతన వస్త్రాల బహూకరణ చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సాపా వీరరాఘవులు ఆధ్వర్యంలో కర్రసాము, కత్తిసాము ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

జూదరుల అరెస్ట్

క్రోసూరు: క్రోసూరు శివారులో పేకాటాడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ మణికృష్ణ, పోలీసుసిబ్బంది బుధవారం దాడులు నిర్వహించారు. ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.6,350, ఐదు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు.

బాలిక అదృశ్యం

పెదకూరపాడు: బాలిక అదృశ్యంపై బుధవారం పెదకూరపాడు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్ఐ బీవీ కృష్ణారావు కథనం ప్రకారం .. బెల్లంకొండ మండలం రామాంజినేయపురం గ్రామానికి చెందిన ఉల్లిగడ్డల జయమ్మ, చిన్నకోటయ్యల 17 ఏళ్ల కుమార్తె గత ఏడాది పదో తరగతి బెల్లంకొండలో చదివి ఉత్తీర్ణత సాధించలేదు. ఈ నేపథ్యంలో నెల రోజుల క్రితం పెదకూరపాడు మండలం 75త్యాళ్ళూరు గ్రామానికి చెందిన పెద్దమ్మ మేడా లక్ష్మి ఇంటికి వచ్చింది. ఈ నెల 19న రాత్రి సమయంలో ఇంటిలో నిద్రిస్తుండగా బాలిక కనిపించకుండాపోడంతో చుట్టపక్కల వారిని అడిగి బంధువులు, తల్లిదండ్రుల ఇంటి వద్ద విచారించారు. ఎక్కడికీ వెళ్లకపోవడంతో తల్లి ఉల్లిగడ్డల జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బీవీ కృష్ణారావు తెలిపారు.

తల్లి మందలించిందని కుమారుడు ఆత్మహత్య

యడ్లపాడు: తల్లి మందలించిందని ఆత్మహత్యకు పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మైదవోలు గ్రామానికి చెందిన పచ్చల వేళంగిణి రాజు దంపతులకు ముగ్గురు సంతానం. వారిలో చిన్నవాడైన పచ్చల మాధవ మంగళవారం ఉదయం మద్యం సేవించి ఇంటికి రావడంతో గమనించి, ఇవేం పనులంటూ తల్లి మందలించింది. మత్తులో ఉన్న మాధవ (18) ఆవేశంతో ఇంటికి మద్యం తెచ్చుకుని అందులో పురుగుల మందు కలుపుకుని తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి గుంటూరు సమగ్ర ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు యడ్లపాడు ఎస్ఐ పైడి రాంబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గొర్రెల కాపరి మృతి

నాదెండ్ల: మొక్కజొన్న పొలానికి వేసిన సోలార్ కరెంటు ఫెన్సింగ్ వైర్లు తగిలి గొర్రెల కాపరి దుర్మరణం పాలైన ఘటన బుధవారం అప్పాపురం గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నాదెండ్ల గ్రామానికి చెందిన గోరంట్ల వెంకటరావు (40) గొర్రెలను మేపుకుని జీవనం సాగిస్తుంటాడు. బుధవారం తన గొర్రెలను తీసుకుని అప్పాపురం పొలాల వైపు వెళ్లాడు. అప్పాపురం గ్రామానికి చెందిన పఠకమూరి శ్రీను అనే రైతు తన మొక్కజొన్న పొలానికి పశువుల నుంచి రక్షణ కోసం సోలార్ కరెంటు ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకున్నాడు. గొర్రెలను మేపుకునేందుకు అటుగా వెళ్లిన వెంకటరావుకు ప్రమాదవశాత్తు వైర్లు తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్థానికులు చిలకలూరిపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. నాదెండ్ల బీసీ కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి.

శోభ సౌభాగ్యం



పెదకూరపాడు మండలం 75త్యాళ్ళూరులో పంచాంగశ్రవణం



క్రోసూరు సాయిబాబా ఆలయ వార్షికోత్సవం సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులకు స్వామి చిత్రపటం బహూకరణ



సత్తెనపల్లిలో ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వర స్వామి దివ్య మంగళ స్వరూపం



ముప్పాళ్ల మండలం చాగంటివారిపాలెంలోని జగన్నాథస్వామి ఊరేగింపు

సత్తెనపల్లి: సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలు అంబరాన్నంటాయి. వైష్ణవాలయాలు భక్తులతో పోటెత్తాయి. ఉగాది పచ్చడి పంపిణీ, పంచాంగ శ్రవణాలతో కళకళలాడాయి. భక్తులు ప్రత్యేక పూజలు చేసి కొత్త సంవత్సరాదిని జరుపుకున్నారు.

- సత్తెనపల్లి వడ్డవల్లి రామాలయం, వేంకటేశ్వర స్వామి, రైల్వే స్టేషన్ రోడ్డులోని వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. రైల్వే స్టేషన్ రోడ్డులోనే వేంకటేశ్వరస్వామిని మత్స్యావతారంలో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.
- సత్తెనపల్లి గోశాలలో 204ఏ శ్రీనివాస డైమండ్ క్లబ్ ఆధ్వర్యంలో గోమాతలకు పండ్లు, కూరగాయలు, పశుగ్రాసం అందించారు. అనంతరం భక్తులకు ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ అయినవోలు నాగ కోటేశ్వరరావు, సెక్రటరీ వనమా నాగేశ్వరరావు, ట్రెజరర్ జి.బాజీ, జాయింట్ సెక్రెటరీ అనుములశెట్టి వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు పెండ్యాల సాంబశివరావు, అడ్డగిరి రవిబాబు, కందకట్ల శ్రీనివాస రావు, దేవరపల్లి రవీంద్ర కుమార్ రెడ్డి, సాయి, పవన్, కరుణ్ పాల్గొన్నారు.

వైభవంగా ఉగాది వేడుకలు

- సత్తెనపల్లి వావిలాల గోపాలకృష్ణయ్య కాంప్లెక్స్ పక్కన రిటైర్డ్ తెలుగు పండితుడు మంచి కంటి వెంకటేశ్వరరావు పంచాంగ శ్రవణం నిర్వహించారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.
- ముప్పాళ్ల మండలంలోని అన్ని గ్రామాల్లో ఉగాది వేడుకలు అంబరాన్నంటాయి. ముప్పాళ్ళలోని అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి, నార్నెపాడులోని భీమలింగేశ్వరస్వామి, మాదలలోని సంగమేశ్వరస్వామి ఆలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. చాగంటివారిపాలెం గ్రామంలోని జగన్నాథస్వామి ఆలయంలో ఉగాది సందర్భంగా తిరునాళ్ళ నిర్వహించారు. గ్రామస్తులు ప్రభలు కట్టుకొని గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. స్వామికి పొంగళ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం ఆయా గ్రామాల్లోని కచేరిలు, మండపాల వద్ద బ్రాహ్మణులు పంచాంగ పఠనం చేశారు.
- పెదకూరపాడు మండలంలోని అన్ని ఆలయాల్లో ఉగాది వేడుకలు జరిగాయి. పెదకూరపాడు, 75త్యాళ్ళూరు, గారపాడు, లగడపాడు గ్రామాల్లో పంచాంగ శ్రవణాలు జరిగాయి.
- ఉగాది సందర్భంగా క్రోసూరులోని సాయిబాబ మందిరం వార్షికోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మన్నెం వెంకట్రావు ఆధ్వర్యంలో భక్తుల కోసం ఏర్పాట్లు చేశారు.

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తరుపున ఏఎంసీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు కృష్ణారెడ్డి, రవిచౌదరి , ఉప్పుటూరి నర్సిరెడ్డి హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కమిటీ సభ్యులు సాయిబాబ చిత్రపటాన్ని వారికి బహూకరించారు. వారి వెంట క్రోసూరు వైఎస్సార్ సీపీ నాయకులు మండల కన్వీనర్ వెలది అప్పారావు, సొసైటీ అధ్యక్షుడు అనుముల కోటిరెడ్డి, తుమ్మపూడి ప్రతాప్‌రెడ్డి, ఏసురెడ్డి, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, డాక్టర్ షరీఫ్, మర్రి కోటిరెడ్డి, పాశంశ్రీనివాసరెడ్డి, అనుముల శ్రీనివాసరెడ్డి, ఖాదర్, అడితి ముస్తఫా, నాగిరెడ్డి పాల్గొన్నారు.

అచంచల భక్తితో అలుపెరగ'కొండ'



నేతి వెంకన్న దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు



పంచాంగ శ్రవణంలో పాల్గొన్న మంత్రి అంబటి

దేవరంపాడుకు పోటెత్తిన భక్తులు

రాజుపాలెం: ఉగాది పండగ సందర్భంగా దేవరంపాడు కొండకు భక్తులు పోటెత్తారు. పల్నాడు తిరుపతిగా పేరుగాంచిన దేవరంపాడు కొండపై మత్స్య రూపంలో వెలసిన నేతి వెంకన్న స్వామిని దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచే అలుపెరగకుండా అచంచల భక్తితో బారులు తీరారు. ఫలితంగా గోవింద నామస్మరణతో కొండ మార్మోగింది. భక్తులు స్వామికి పొంగళ్లు చేసి, నెయ్యి, బెల్లం, పప్పు వగైరాలు సమర్పించారు. పశుసంపదను కాపాడాలని స్వామికి నెయ్యిని సమర్పించి మొక్కుకున్నారు. భక్తులు తీసుకొచ్చిన చిన్నచిన్న ప్రభలు ఆకట్టుకున్నాయి. ఆలయంలో ఉగాది పంచాంగ శ్రవణం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పాల్గొన్నారు. ఆయన స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా ఆలయ ప్రధాన అర్చకులు మంత్రి అంబటికి మేళతాళాలతో, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అంబటి వెంట మాజీ ఎంపీపీ బాసు లింగారెడ్డి, మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి, దేవస్థాన కమిటీ చైర్మన్ అంబటి బ్రహ్మయ్య, సర్పంచ్ పత్తిపాటి దీనమ్మకోటేశ్వరరావు, జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీతాశ్రీనివాసరెడ్డి, ఈవో గుర్రం శ్రీనివాసరెడ్డి , సత్తెనపల్లి మండల కన్వీనర్ రాయపాటి పురుషోత్తం, కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్ ఉన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో శావల్యాపురం విద్యార్థినుల సత్తా



విజేతలను అభినందిస్తున్న ఎంపీపీ, చైర్మన్

శావల్యాపురం: రాష్ట్ర స్థాయిలో జరిగిన బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో శావల్యాపురం హైస్కూల్ విద్యార్థినులు సత్తా చూపడం అభినందనీయమని ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్ అన్నారు. హైస్కూల్‌లో జరిగిన అభినందన కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడుతూ బాలబాలికలు విద్యతో పాటు క్రీడాల్లో రాణించటం శుభపరిణామమన్నారు. పాఠశాల హెచ్ఎం జాలాది శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి 20 వరకు నెల్లూరు జిల్లా కావలిలో 7వ జూనియర్ (అండర్-19) బాలికల బాల్‌బ్యాడ్మింటన్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు మూడో స్థానంలో నిలిచిందని చెప్పారు. ఇదే పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థి ముక్కపాటి లిఖిత ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 3 వరకు మహారాష్ట్రలో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటుందని పాఠశాల పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి తెలిపారు. క్రీడాకారులను అభినందించి తమవంతు ఆర్థిక చేయూత అందించిన ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్ కుమార్, శావల్యాపురం సొసైటీ చైర్మన్ చెన్నయ్యను ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో మద్దికుంట సాంబశివరావు, ఉపాధ్యాయులు బీవీ నాగేశ్వరరావు, భువనేశ్వరి, కిషోర్, అబ్దుల్లా, ఆదాంఖాన్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతిలో సత్తా చాటాలి



ఫేర్‌వెల్‌లో పాల్గొన్న పదో తరగతి విద్యార్థులతో హెచ్ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు

నాదెండ్ల: పదో తరగతి పరీక్షల్లో సత్తా చాటిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తామని హెచ్ఎం తాడిశెట్టి సత్యనారాయణ చెప్పారు. గణపవరం కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఫేర్‌వెల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పల్నాడు జిల్లాలోనే 1,300 మంది పైబడి విద్యార్థులతో అతిపెద్ద పాఠశాలగా తమ హైస్కూల్ ఉందన్నారు. పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు 168 మంది ఉన్నారన్నారు. గత ఏడాది కరోనా కారణంగా ఫలితాల్లో కొంత శాతం తగ్గుదల కనిపించిందని, ఈ ఏడాది నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. గడిచిన మూడేళ్లలో 20 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారన్నారు. పోటీతత్వం, ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

వైభవంగా ఇస్కాన్ వార్షికోత్సవం



నరసరావుపేట ఈస్ట్: బరంపేటలోని రాధాగోవింద చంద్ర మందిరం ఇస్కాన్ ఆలయంలో ఉగాది వేడుకలు, ఆలయ 11వ వార్షికోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉదయం మూలమూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, శుభ మంగళ హారతి సమర్పించి ప్రత్యేక అలంకరణలతో భక్తులను దర్శనానికి అనుమతించారు. మూలమూర్తుల ఎదుట ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ఉత్సవమూర్తులకు 54 రకాల ఫలద్రవ్యాలు, పంచామృతాలతో మహాశంఖాభిషేకం నిర్వహించారు. అనంతరం వివిధ రకాల మధురభక్ష్యాలతో మహారాజభోగ నివేదన చేశారు. సాయంత్రం మూలమూర్తులకు 1008 కిలోల పూలతో మహాపుష్పాభిషేకం నిర్వహించి ఉత్సవమూర్తులకు ఆలయ పుష్కరిణిలో తెప్పోత్సవం జరిపారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మిరప రైతులను ఆదుకోవాలి



యడ్లపాడు: వడగళ్ల వానతో దెబ్బతిన్న మిరప పొలాలను రైతు, కౌలురైతు సంఘం నాయకులు బుధవారం పరిశీలించారు. కారుచోల గ్రామానికి చెందిన రైతులు గొట్టం నాగేశ్వరరావు, పెద్ది వీరయ్య విజయ్ కాంత్, కల్లూరి భూషయ్య పొలాల్లో ఇటీవల కురిసిన వడగండ్ల వానతో పంట నేలమట్టమైందని, సదరు పొలాలను అధికారులు వెంటనే సర్వేచేసి నష్టం వివరాలు ప్రభుత్వానికి నివేదించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌలు రైతు సంఘం కార్యదర్శి వై.రాధాకృష్ణ, సంఘం నాయకులు కల్లూరి రామస్వామి, రామారావు, నూతలపాటి కాళిదాసు, జరుగుల శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ అన్నదాన సత్రానికి విరాళాలు

శావల్యాపురం: బొందిలిపాలెం గ్రామంలో వేంచేసిఉన్న అడవి పేరంటాళ్లమ్మ తిరునాళ్ల సందర్భంగా కాకతీయ అన్నదాన సత్రానికి దాతలు విరాళాలు అందజేస్తున్నట్లు వ్యవస్థాపక కమిటీ సభ్యుడు నాగుబడి వీరనారాయణ బుధవారం తెలిపారు. గుంటుపాలెం గ్రామానికి చెందిన జైశ్రీరాం యూత్ రూ.30,116, మతుకుమల్లి గ్రామవాసి ఆలూరి వెంకట నరసయ్య, నాగేశ్వరమ్మ దంపతులు రూ.15 వేలు, మురళీకృష్ణ రూ.15 వేలు, రవిప్రసాద్ రూ.15 వేలు, భీమని శ్రీనివాసరావు రూ.15,116, చింతా రమణయ్య రూ.10,116, వేముల లక్ష్మీనారాయణ రూ.10,116, పోట్లూరు గ్రామానికి చెందిన యలవర్తి చినవెంకటేశ్వర్లు రూ.15 వేలు, వెల్లలచెరువు వాసి చింతా శ్రీధర్ బాబు రూ.10,116, కారుమంచి గ్రామవాసి చుండూరి రామకోటేశ్వరరావు రూ.10,116, కొత్తలూరు గ్రామవాసి గోపు వెంకటేశ్వర్లు రూ.10,116 అన్నదానం నిమిత్తం విరాళాలు అందజేశారన్నారు. కాకతీయ అన్నదాన సత్రం అభ్యున్నతికి దాతల సహకారం అభినందనీయమన్నారు.

31లోగా ప్రైవేట్ హాస్పిటళ్లు సర్టిఫికెట్లు పొందాలి

నరసరావుపేట: జిల్లాలో హాస్పిటల్స్‌తో పాటు ప్రైవేట్‌గా వైద్యసేవలు అందజేసే యూనిట్ల నిర్వాహకులు ఈ నెల 31లోగా రిజిస్ట్రేషన్లు, రెన్యువల్స్ చేసుకొని సర్టిఫికెట్లు పొందాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.శోభారాణి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఏపీఎంసీఈ చట్టం-2008, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ జీవో నంబరు 135ను అనుసరించి జిల్లాలోగల హాస్పిటళ్లు, ఫిజియోథెరపీ, డెంటల్ క్లినిక్స్, ల్యాబ్‌లు నూతనంగా పెట్టినవి అయితే వెంటనే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. ఐదేళ్లు దాటిన పాతవి అయితే ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసుకొని రెన్యువల్ చేయించుకొని సర్టిఫికెట్లు పొందాలని పేర్కొన్నారు. రాష్ట్ర విజిలెన్స్ అధికారులు తనిఖీ చేసిన సమయంలో సర్టిఫికెట్లు లేకుండా పట్టుబడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.


పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



ముప్పాళ్ళ జెడ్పీ పాఠశాలలో పూర్వవిద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యం

ముప్పాళ్ళ: పాఠశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థులు భాగస్వాములు కావాలని పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు మారూరి రామలింగారెడ్డి చెప్పారు. ముప్పాళ్ళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమావేశం బుధవారం జరిగింది. రామలింగారెడ్డి మాట్లాడుతూ పూర్వ విద్యార్థులంతా సంఘంగా ఏర్పడి పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు వివరించారు. సమావేశ మందిరం నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. ఆడిటోరియంతోపాటుగా పాఠశాలలోని విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల మౌలిక వసతుల కల్పనలోనూ పూర్వ విద్యార్థులు తమ వంతు సహకారం అందించాలని కోరారు. అనంతరం పూర్వ విద్యార్థులు, ప్రస్తుతం ఉద్యోగ విరమణ చేసిన రామలింగారెడ్డి, మాజీ ఎంఈఓ కృష్ణారెడ్డిని దుశ్శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంజెఎం రామలింగారెడ్డి, శ్రీనివాసరావు, వెంకటరెడ్డి, ఎస్.కె.మాబు, ఈశ్వరరెడ్డి, వీఆర్ ప్రసాద్ రెడ్డి, మిరియాల వెంకటేశ్వరరావు, కె.సాయిజగన్నాథం, బొప్పూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చల్లగుండ్ల ప్రసన్నాంజనేయుని తిరునాళ్ల



విశేష అలంకరణలో చల్లగుండ్లలోని ప్రసన్నాంజనేయస్వామి

నకరికల్లు: చల్లగుండ్ల గ్రామంలో వేంచేసిన ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల బుధవారం ఘనంగా నిర్వహించారు. తెలుగు సంవత్సరాది ఉగాది సందర్భంగా వార్షిక తిరునాళ్ల నిర్వహించారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. అర్చకులు ఫణికుమార్‌శర్మ ఆధ్వర్యంలో స్వామికి విశేష ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. పంచామృతస్నపన గావించారు. ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా గ్రామంలోని భక్తులతోపాటు సమీప గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. విశేష అలంకరణలో ఉన్న స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. ఆలయం వద్ద ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

సత్తెనపల్లివాసులు ఇద్దరికి ఉగాది పురస్కారాలు



పురస్కారంతో జింకా రామారావు



ఉగాది పురస్కారాన్ని అందుకుంటున్న మంచికంటి వెంకటేశ్వరరావు

సత్తెనపల్లి: ఉగాది పురస్కారాలకు సత్తెనపల్లి నుంచి ఇద్దరిని ఇటీవల ఎంపిక చేసిన విషయం తెలిసిందే. పట్టణానికి చెందిన సాహితీవేత్త, రిటైర్డ్ తెలుగు పండితుడు మంచికంటి వెంకటేశ్వరరావు, ప్రముఖ చిత్రకారుడు జింకా రామారావుకు బుధవారం ఉగాది పర్వదినం సందర్భంగా నరసరావుపేటలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు, నరసరావుపేట శాసన సభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పల్నాడు కలెక్టర్ లోతేటి శివశంకర్, జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ వై.రవిశంకర్ రెడ్డి వీరికి పురస్కారం అందించారు.

బ్లాక్ ఫంగస్ బాధితునికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న ఏఐఎమ్ నాయకులు

సత్తెనపల్లి: పాటిబండ్లలో తాపీ మేస్త్రీగా పని చేస్తూ జీవనం వెళ్లదీస్తున్న మద్దు పురుషోత్తం కరోనాకు గురై బ్లాక్ ఫంగస్ వల్ల కంటి చూపు కోల్పోవడంతో అంబేడ్కర్స్ ఇండియా మిషన్(ఏఐఎం) ఆధ్వర్యంలో రూ.10 వేల ఆర్థిక సహాయం బుధవారం అందించారు. కార్యక్రమంలో ఏఐఎం సత్తెనపల్లి గౌరవ అధ్యక్షుడు కేబీఆర్‌జే ప్రసాద్, అధ్యక్షుడు నేలం పీటర్ ప్రసాద్ రాజు, ప్రధాన కార్యదర్శి తురకా రాజు, కార్యకర్తలు తమనం సాల్మన్, చల్లా జాన్ పాల్, నేలటూరి రమేష్, దారా ఉర్ధయ్య, దారా జాషువా, కొల్లూరి ప్రసాద్, చొక్కా ప్రేమ్ సాగర్, వంజా సుధీర్, పారా రాం ప్రసాద్, చుక్కా రవి, విప్పర్ల రత్నం తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు, వైద్యుడు బుచ్చిబాబు

వినుకొండ టౌన్: పౌష్టికాహారంతో పాటు ఏఆర్టీ మందులను సక్రమంగా తీసుకోవడం ద్వారా జీవితకాలాన్ని పొడిగించుకోవచ్చని ప్రభుత్వ వైద్యశాల వైద్యులు ఎస్.బుచ్చిబాబు పేర్కొన్నారు. ఉగాది పర్వదినం సందర్భంగా పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్‌కేర్ సెంటర్‌లో చైల్డ్ ఫండ్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ లింక్ వర్కర్ స్కీమ్ ప్రాజెక్ట్ వారి ఆధ్వర్యంలో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు డాక్టర్ ముసలారెడ్డి సహకారంతో పౌష్టికాహారాన్ని బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్ ఎం.వాసుదేవరావు మాట్లాడుతూ హెచ్ఐవీ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చూపరాదని సూచించారు. కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ కె.సురేష్, జోనల్ సూపర్‌వైజర్స్ బి.నాగేశ్వరరావు, ఎం.విశ్వేశ్వరరావు, లింకు వర్కర్ వై.ఏడుకొండలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.